# వైద్య మహాశయుఁడు

డాక్టరు సుదర్శనరావుగారి తలిదండ్రులు సూక్ష్మబుద్ధి గలవారని యూహింపదగియున్నది. లేకున్న డాక్టరుగారిబుద్ధి రోగములపై (రోగులపైగాదు)సుదర్శనచక్రమువలె బనిచేయునని జననకాలమందే కనిపెట్టి సార్థకనామధేయము నుంచుట వారికెట్లు సాధ్యపడును ? డాక్టరుగారు మహోన్నతకాయుడు. చిన్నపుడు బాగుగా కసరత్తుచేసి పెంచిన దేహముగుటచే రోగిమంచముప్రక్కను డాక్టరుగారు నిలువఁబడినపుడు "యమభటులతోఁబోరాడియైన వారిబారినుండి నన్నీయన రక్షింపఁగలడు" అను ధైర్యము రోగికి కలిగితీరును.

దేహబలమేకాక బుద్ధిబలముకూడ మా వైద్యమహాశయున కపారమే. ఆతనికున్న యెత్తులు మాయూరినింకెవ్వరికిని లేవు. ఇంతవరకు డాక్టరుగారు పొందినడిగ్రీ (ప్యాసయిన పరీక్ష) యేదో కనుగొనఁజాలినవారు మాయూర నొక్కరును లేరు. జనసమాజములో కొందరాతడు యం.బి బి యస్. అనియు, మరికొందరు యల్.ఆర్.సి.పి. అనియు, యింకను కొందరు మరికొన్నియక్షరములను వేసినో సంపుటరీకరించియు స్వకపోలకల్పితములగు డిగ్రీలు యిచ్చుచున్నారేకాని యొక్కరును వాస్తవము నెఱుంగరు. జ్యోతిశ్శాస్త్రసాహాయ్యముననైన డాక్టరుగారిడిగ్రీయేదో తేలకుండనున్నది. గతపుష్కరమునుండియు ఆయన మాయూరప్రాక్టీసు చేయుచున్నను ఆయన స్వగ్రామమిదియని నిశ్చయించి పలుకఁగలవారిప్పటికొక్కరును మాయూర లేరు. ఆయన యేయూరివాడైన మనకేందులకుగాని క్రొత్తగావృత్తిలోనికిఁ బ్రవేశింపదలచుకొన్న యువకులు ఆయనయొద్ద నేర్చుకొనవలసిన యంశము లసంఖ్యాకములుగనుండుటచే లోకోపకారార్థము అందు నాకు ముఖ్యమనితోచిన లక్షణముల నిందు వర్ణించుచున్నాను.

మొదటిది వారిమందహాసము. వారిమందహాసము సోకినరోగి మరలవారిని విడిచిపెట్టదు ఎప్పుడు నవ్వవలెనో ఏరీరును నవ్వవలెనో ఎంతవరకు నవ్వవలెనో వారికి తెలసినట్లు యింకొకరికి తెలియదు. ఆ మందహాసము సంపెంగపువ్వు పరిమళమువలె మొగముమొత్తదు గులాబీపుష్పసౌరభ్యమువలె మెల్లమెల్లగ హృదయాకర్షణ మొనర్చును. "నీ వైద్యము నాకొంపదీసినది" అని తిట్టుటకు వచ్చినవారినిసైతము చేతులు జోడించి నమస్కరింపఁజేయు సమ్మోహనశక్తి దానిలోనున్నది. ఆ మందహాసమునకు రోగులయినుపపెట్టెలు తమంతతాముగ విడిపోవును. ఆతనిహృదయము ఆపరేషను కత్తికంటెను నిశితమైనది. కాని ఎంతటిక్రౌర్యమునైనను ఎంతటికౌటిల్యమునైనను ఆతడు మందహాసము చాటున మాటుపఱచఁగలఁడు ఆపరేషను టేబిలుమీఁది చంద్రహాసము కంటె మాడాక్టరుగారి మందహాసమే ప్రయోజనకారియని తజ్ఞులకు తెలియని విషయముకాదు.

మాడాక్టరుగారి రెండవలక్షణము గాంభీర్యము. ఎవరెస్టుపర్వతము ఎత్తు కనుగొనఁజాలిన ధీరులున్నారు. పసిఫిక్ సముద్రము లోతు కనుగొనఁజాలిన శాస్త్రజ్ఞులున్నారు. కాని మావైద్యమహాశయుని మనస్తత్వము గనుగొనఁజాలిన ధీమంతు డిప్పటికి

పుట్టలేదు. ఆత డడుగని వారిది పాపము ధన మిచ్చును. కాని ఎవ్వరికి మనస్సుమాత్ర మీయడు. లోకమందరు నాతనికి స్నేహితులే ఆతనియింట టీపార్టీ జరుగని పూట లేదు. నిరతాన్నదాత. స్నేహితులుకాదు పర దేశబ్రాహ్మణులుకాదు ఎవరైనను వచ్చి తిని పోవచ్చును. ఎన్నిదినములున్నను "నీవెందుకు వచ్చినావు. ఇంకను ఎన్నిదినము లుండఁదల చుకొన్నావు?" అని యడుగువారు లేరు. ఈ అన్నదానమున నాతనికి జాతిమతభేద మెంతలేదు. క్రిష్టియనులుకాదు ముసల్మానులు కాదు ఎవ్వరైననుసరే ఆతని యాదరణకు, స్నేహమునకు పాత్రులే. గోపికలలో ఎవరిమట్టుకు వారే శ్రీకృష్ణునికి తక్కినవారియందు కంటె తనయందు ప్రేమాతిశయమని అనుకొనువారట. ఆతీరుననే అతనిస్నేహితులుకూడ ఎవరిమట్టుకువారే తన్నాతడు తక్కినవారి కంటె నెక్కుడుగ ప్రేమించునని అనుకొందురు. కాని ఒక్కరికిని ఆతనిగుట్టు తెలియదు.

మావైద్యమహాశయుని మూడవలక్షణము సర్వవ్యాపకత్వము. ఆతడు గాయకులలో గాయకుడు. నటకులలో నటకుడు. శ్రోత్రియులలో శ్రోత్రియుడు. సంఘసంస్కర్తలలో సంస్కర్త. ఈదినము కాస్మోపాలిటను డిన్నరు. రేపు పంచగవ్యప్రాయశ్చిత్తముతో రామాయణపారాయణ. శ్రీమహావిష్ణువునవతారములనైన లెక్కపెట్టవచ్చును గాని మావైద్యమహాశయుని వేషములను గణింప నలవికాదు. వేషముచేతనే గాక బాషచేగూడ మాడాక్టరుగారు జనాదరణమును సంపాదించుకొనగలరు. కన్యాశుల్కము, కంఠాభరణము మున్నగు నాటకములలోని హాస్యముచే రోగులను నవ్వించి వారి యనురాగమునకు పాత్రుడగుచుండును. "సాహసాద్భజతే లక్ష్మి" అను నార్యోక్తికి మాడాక్టరుగారు ప్రబలనిదర్శనము. ఎంతటి దుస్సాధ్యమైన రోగమునైనను సరియే "నేను కుదుర్చలేను" అనియాతడు చెప్పడు. కన్నుగాదు కాలుగాదు చెవికాదు ముక్కుగాదు ఏదైననుసరే నిరాఘాటముగ చెక్కివేయును. వైద్యసాహాయ్యము నిమిత్తము నచ్చినవారితో ముందుగ ఫీజు నిర్ణయించుకోవడము పద్ధతి యెన్నడును లేదు ఆపద్బాంధవుడగు రోగి కంటబడినది తడవుగ నడుమున కంగవస్త్రముకట్టుకొని నడిసముద్రములో నురుకు మన్నను ఉరుకును. ఈగకాలంత చోటిచ్చినచో ఏనుగదేహమునకు సరిపోవు నావకాశమును సంపాదింపఁగలఁడు. అయిదురూపాయలు రావలసినచోట అరువదిరూపాయలు పుచ్చుకొనఁగల సామర్థ్యమున్నది. ఆసేతుహిమాచలముననున్న డాక్టరులలో ఎవరినిగూర్చి యడిగిననుసరే వైద్యవిషయమున వారికేమి తెలియదని మనలను నమ్మించఁగల వాక్చాతుర్య మాతనికడ నున్నది. "ఇంత సుప్రసిద్ధునిగూర్చి యింతనిరసనభావముతో ముచ్చటింపవచ్చునా" యని యెన్నడు నాతడు వెనుకకు జంకడు. మరియు మాయూరనే క్రొత్తయుద్యమము వచ్చినను ఆతడు ముందంజవేయును. క్రొత్తగా నాటకము వచ్చినచో పిట్టులో నాతడు ప్రత్యక్షము. క్రొత్తగా సర్కసుగాని సినిమాగాని వచ్చినచో రాజపోషకులలో నాత డొకడు. ఒకపత్రికకాదు క్లబ్బుకాదు కాన్ఫరెన్సుగాదు ఏదిమొదలు పెట్టినను చందాలువేయుటలో తక్కినయూరివారందరు నొకయెత్తు. తానొక్కడు నొక్కయెత్తు. అట్లుచేసినగాని ప్రాక్టీసు సంపాదింపలేమనియు సంపాదించినప్రాక్టీసును నిలువఁబెట్టుకోలేమనియు నాతని నమ్మకము. ఎవరినమ్మకములు వారివి. వానితో మనకేమిగాని యాతని యీనమ్మకమువలన లో

కోపకార సుఖితముగ జరుగుచున్నది.

ఇంత విచ్చలవిడిగా సాహసించుచున్నాడు గదాయని మాడాక్టరుగారి కాత్మక్షేమముపై ప్రాలుమాలికయని మీరు భ్రాంతిపడవలదు క్షీరసాగరమున హాలాహలమువలె నాత్మక్షేమపరాయణత్వ మాతనిమనస్సున నతిని గూఢముగ నిక్షిప్తమైయున్నది. పైకెంత పరోపకారపారీణుడో లోపలనంత స్వలాభపరాయణుడు. నడచే నడకయందు మాట్లాడే మాటయందు నవ్వే నవ్వునందు - అంతయు స్వలాభమే. అయిదారుసుఖరోగముల కేసులను సంపాదించే అవకాశము లేకుండ నయిదుహూయలు పెట్టి నాటకములో టిక్కట్టు నెన్నడు నాతడుకొనడు. మీకాసందేహమేల? ఈదినము హరికథయని రేపు పాట కచ్చేరీయని యేదో యొకతీరున క్రొత్తక్రొత్త వినోదములను కల్పించి నలువురను తమయింటికి రప్పించు సూత్ర మాలోచించుచునే యుండును. ఈదినముకర్చుపెట్టినాడో రేపు వడ్డీతోసహా పుచ్చుకొన్నాడో!

ఆత్మక్షేమపరాయణుడని మా వైద్యమహాశయుని మీరు నిరసింపనక్కరలేదు. ఆత్మక్షేమములో విశ్వహితమునుకూడ నాతడు జోడించి ఉభయతారకముగ తనవైద్యమును సాగించుచున్నాడు. మా వైద్యుడొక కేసు పట్టినా దానివలన ననంతముగ భూతసంతృప్తి జరగుచున్నది. శవముపై నాధారపడిన క్రిమికీటకములు రాబందులు మొదలుకొని "ఎప్పైనను గోదానమే" యని దీక్షవహించిన బ్రాహ్మణోత్తములవరకు నందరు మా వైద్యమహాశయుని హస్తవిశేషమును కొనియాడవలసినదే. మా వైద్యమహాశయు డిల్లు బయలుదేరినది మొదలుకొని ఎక్కడ చూచినను ఆతని యనుచరుల నమస్కారబాణములే మందహాసముల మంగళహారతులే.

విశ్వకల్యాణనిమిత్తము మా వైద్యమహాశయునకుఁగల దీక్షను ఇంతంతయని వర్ణింపనలవికాదు. ఇప్పటికి నలువదియేండ్లు దాటినను లోకసంగ్రహార్థ మస్ఖలితబ్రహ్మచర్య దీక్షనవలంబించి పనిచేయుచున్నాఁడు. ఆతని పరస్త్రీపరాఙ్ముఖత్వమునకు పురుషులందరును నిస్సందేహముగ సాక్ష్యమీయగలరు. అట్లని యాతనికి కల్యాణముమీద దృష్టిలేదని కాని పాణిగ్రహణపారీణుడు కాదనిగాని యూహింపకుందురుగాక. అనాథలగు వేశ్యలకును, బాలవితంతువులకును అనివార్యములగు యాపదలు తటస్థించినపుడు చక్రమడ్డువైవగల మహానుభావుడు సుదర్శనరావుగారొక్కరేయని మాయూరివారు ఘంటాపథముగ జెప్పుచుందురు. అర్థశాస్త్రమున గడనయెంత ప్రధానమో కర్చుపెట్టుటకూడ అంతియే ప్రధానమని గ్రహించిన వేత్తయగుటచే నాతడు ఎంతశీఘ్రముగ గడించునో అంత శీఘ్రముగ కర్చుపెట్టుచున్నాడు.

ఇట్టి వైద్యమహాశయులవలన కలుగు లోకోపద్రవమును తొలగించుటకై ఋగ్వేదమునందు పెక్కు ఋక్కులు రచింపఁబడినవి. అందొకదాని యనువాదము నీక్రింద బొందుపఱచుచు నీవ్యాసమును ముగించుచున్నాను. "ఓపురుషుడా! వైద్యులబారినుండియు వన్యమృగముల బారినుండియు మమ్ము రక్షింపుము. విషవాయువులకంటెను ప్రమాదకరమైన చిరునవ్వులతో హాలాహలముకంటెను నపాయకరమగు తృష్ణతో అశనిపాతముకంటెను తీవ్రములగు దృష్టులతో లోకమును క్షయింపజేయుచున్న యీ వైద్యమహాభూతములనుండి మాతల్లులకడుపుచలువయు, నీ యనుగ్రహమును మాకు నిత్యము అంగరక్షలై పనిచేయుగాక!" తథాస్తు.

—నందూరి బంగారయ్య